సాక్షి ఖమ్మం

గురువారం ౹ 2 ౹ నవంబర్ ౹ 2023



గీత దాటొద్దు...

ఎన్నికల వేళ అభ్యర్థులు, నాయకులు హద్దు మీరకుండా ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను రూపొందించింది.

10లో



అథ్లెటిక్స్ పోటీలకు స్పందన

ఉమ్మడి జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు 242 మంది హాజరుకాగా, ప్రతిభ చాటిన వారితో జట్లను ఎంపిక చేశారు.

10లో

గరిష్టం / కనిష్టం

34° / 22°

వాతావరణం

జిల్లాలో గురువారం ఉదయం, సాయంత్రం చలిగాలుల ప్రభావం కనిపిస్తుంది. మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రత నమోదవుతుంది.

న్యూస్‌రీల్

'మెడికల్' సూపరింటెండెంట్‌గా కిరణ్‌కుమార్



బాధ్యతలు స్వీకరించిన కిరణ్‌కుమార్‌తో వెంకటేశ్వర్లు తదితరులు

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిని తెలంగాణ వైద్య విధాన పరిషత్ నుండి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌లోకి బదలాయించారు. ఈమేరకు ఆస్పత్రిలోని మాతా శిశుఆరోగ్య కేంద్రంతో పాటు అన్ని విభాగాలను ప్రస్తుత మెడికల్ సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు డీఎంఈకి అప్పగించగా, ప్రభుత్వ మెడికల్ కళాశాల, టీచింగ్ హస్పిటల్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ బి.కిరణ్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రెండు నెలల క్రితమే ఆయనను నియమించినా వివిధ కారణాలతో బాధ్యతలు స్వీకరణ ఆలస్యమైంది. ఇక ఆర్థిక పరమైన అంశాలకు సంబంధించి ఉన్నతాధికారులు చేపట్టిన ఆడిట్ వారంలో పూర్తికానుంది. కాగా, డాక్టర్ బి.వెంకటేశ్వర్లు జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారిగా కొనసాగనున్నా రు. అలాగే, డిప్యూటీ సూపరింటెండెంట్‌గా ఎల్.కిరణ్‌కుమార్ బాధ్యతలు తీసుకున్నారు. ప్రభుత్వ ఆస్పత్రి డీఎంఈ పరిధిలోకి వెళ్లడంతో వైద్యసేవలు మరింత మెరుగుపడే అవకాశముంది.

నవోదయ దరఖాస్తు గడువు పెంపు

కూసుమంచి: పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయలో 9, 11వ తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునే గడువు పొడిగించారు. ప్రస్తుతం 8, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఈనెల 7 వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసులు ఒక ప్రకటనలో సూచించారు.

తేమ శాతమే ప్రామాణికం



పత్తి కొనుగోళ్ల సందర్భంగా పూజలో అధికారులు

ఖమ్మంవ్యవసాయం: ప్రభుత్వం కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ద్వారా ఏర్పాటు చేసిన కేంద్రాల్లో తేమ శాతమే ప్రామాణికంగా పత్తి కొనుగోళ్లు ఉంటాయని జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎం.ఏ.అలీం తెలిపారు. జిల్లాలోని ఎంపికచేసిన కేంద్రాల్లో బుధవారం సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు మొదలయ్యాయి. ఖమ్మం మార్కెట్ పరిధి వెంకటగిరి జిన్నింగ్ మిల్లులో పత్తి కొనుగోళ్లను ప్రారంభించిన అలీం మాట్లాడుతూ రైతులు నేరుగా సాగు చేసిన పంట మాత్రమే కొనుగోలు చేస్తారని, 8నుంచి 12శాతం వరకు తేమ ఉన్న పత్తినే తీసుకొస్తే, ఎనిమిది శాతం తేమ కలిగిన పత్తి క్వింటాకు రూ.7,020 ధర వస్తుందని తెలిపారు. మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి మల్లేశంతో పాటు వజీరుద్దీన్, అవినాష్, గొడవర్తి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను దత్తత తీసుకోండి..



మాట్లాడుతున్న డీఈఓ సోమశేఖరశర్మ

సత్తుపల్లిటౌన్/వేంసూరు: పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు దత్తత తీసుకుని బోధించాలని జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ సూచించారు. సత్తుపల్లిలోని పాతసెంటర్ హైస్కూల్‌లో బుధవారం సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి మండలాల ప్రధానోపాధ్యాయులతో ఆయన సమావేశమయ్యారు. ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన ఉన్నతి, లక్ష్య కార్యక్రమాలపై సమీక్షించాక డీఈఓ మాట్లాడుతూ ఎస్సెస్సీలో ఈ ఏడాది నూరు శాతం ఫలితాలు వచ్చేలా నమోదయ్యేలా దృష్టి సారించాలని తెలిపారు. అధికారులు నక్కా రాజేశ్వరరావు, మోహన్‌రావు, సత్యనారాయణ, వేంసూరు ఎంఈఓ వెంకటేశ్వరరావు, హెచ్‌ఎంలు జయరాజు, యాకోబు, శైలకుమారి పాల్గొన్నారు. అంతకు ముందు వేంసూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డీఈఓ తనిఖీ చేయగా ఎంఈఓ వెంకటేశ్వరరావు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు సుధాకర్‌రెడ్డి, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

రూ.11.50లక్షల నగదు సీజ్

ఖమ్మంక్రైం: జిల్లాకేంద్రంలో బుధవారం ఖమ్మం త్రీ టౌన్ పోలీసులు చేపట్టిన తనిఖీల్లో రూ.11.50లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. హర్కార బావి సెంటర్, పంపింగ్‌వెల్ రోడ్డు ప్రాంతాల్లో నగదు తీసుకెళ్తున్న వారి వద్ద సరైన పత్రాలు లేకపోవడంతో సీజ్ చేశామని సీఐ సత్యనారాయణ తెలిపారు.

సత్తుపల్లి సత్తా చాటండి..

- వెంకటవీరయ్య 70 నుంచి 80 వేల మెజార్టీతో గెలుస్తాడు
- ఎన్నికల తర్వాత వచ్చి అందరికీ దళితబంధు పంపిణీ చేస్తా
- పార్థసారథిరెడ్డి మాతృభూమిని వదలకుండా పనిచేస్తున్నారు
- సీతారామ ఇప్పటికే 70 శాతం పూర్తి.. ఏడాదిన్నరలో నీళ్లు
- ఖమ్మం జిల్లా డబ్బు, అహంకార రాజకీయాలను సహిస్తదా?
- కల్లూరు ప్రజా ఆశీర్వాద సభలో ముఖ్యమంత్రి కేసీఆర్



సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్, పక్కన అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య, మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీలు బండి పార్థసారథిరెడ్డి, నామ నాగేశ్వరరావు, ఎమ్మెల్సీలు మధు, మధుసూదనాచారి, ఎమ్మెల్యేలు రాములునాయక్, మెచ్చా నాగేశ్వరరావు తదితరులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: 'వెంకటవీరయ్య నాకు దగ్గరి మనిషి. సీనియర్ రాజకీయ నాయకుడు. ఆయన గట్టిగా అడిగితే మంత్రి, ముఖ్యమంత్రి కాదనే పరిస్థితి లేదు. ప్రజల కోసం అంబులెన్స్ కన్నా ముందు పక్షిలా వాలిపోతడు. బీఆర్‌ఎస్ నుంచి సండ్ర వెంకటవీరయ్య నిల్చున్నడు. కాంగ్రెస్, బీజేపీ నుంచి ఉంటారు.. వీళ్ల కాక ఎల్లయ్య, పుల్లయ్య ఉంటారు. సండ్ర మీ కోసం ఏం చేశాడో మీ మనసులో ఉంది. సండ్రను, వారి వెనుక ఉన్న పార్టీని ఆదరించాలి. ఈ ఎన్నికల్లో చైతన్యవంతమైన సత్తుపల్లి వాసులు సత్తా, సత్తువ చాటాలి. మంచి వ్యక్తి అయినందున సండ్ర 70వేల నుంచి 80వేల మెజార్టీతో గెలుస్తాడని సభను చూస్తేనే అర్థమవుతోంది.' అని ముఖ్యమంత్రి కేసీఆర్ పేర్కొన్నారు. సత్తుపల్లి నియోజకవర్గ ప్రజా ఆశీర్వాద సభ కల్లూరులో బుధవారం జరిగింది. ఈ సభకు భారీగా హాజరైన జనాలను ఉద్దేశించి కేసీఆర్ చేసిన ప్రసంగం ఆయన మాటల్లోనే..

సీతారామ నా గుండెకాయ..

సీతారామ నాకు గుండెకాయ లాంటి ప్రాజెక్టు. ఇప్పటికే 70శాతం పనులు పూర్తికాగా, మిగిలినవీ కాబోతున్నాయి. మీ అందరూ ఆశీర్వదిస్తే ఏడాదిన్నరలో నేనే వచ్చి ప్రాజెక్టు స్విచ్ఛాన్ చేస్తా. ఈ ప్రాజెక్టుతో కల్లూరు లాంటి ప్రాంతానికి నీటి సమస్య ఉండదు. కృష్ణా నీటి వ్యవహారం నాలుగు రాష్ట్రాల పంచాయితీ. మనకు నీళ్లు తక్కువ. అందుకే సీతారామ ప్రాజెక్టు పాత ఖమ్మం జిల్లాకు వరప్రదాయిని కాబోతోంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే సీదా నీళ్లు తెచ్చి పాలేరులో వేస్తాం. ఖమ్మం బంగారు తునక అవుతది. రైతులు మూడు పంటలు పండించి కాలు మీద కాలు వేసుకుని కూర్చుంటరు.

ఇంత అహంకారమా?

బీఆర్‌ఎస్ నుంచి నిలబడిన ఒక్కరినీ అసెంబ్లీ వాకిలి తొక్కనివ్వమని అంటున్నరు(మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఉద్దేశించి). ఉద్యమ నాయకుడిగా, సీఎం అయినా కూడా ఇంత అహంకారంగా నేనెన్నడూ మాట్లాడలేదు. అహంకారం, డబ్బు రాజకీయాలను ఖమ్మం సహిస్తదా? ఏ పార్టీ వైఖరి ఏమిటో.. ఎవరేం చేశారో ప్రజలకు తెలుసు. సండ్ర వెంకటవీరయ్య నాలుగోసారి పహిల్వాన్‌లాగా అసెంబ్లీలో అడుగు పెట్టేలా ప్రజలు దుమ్ములేపాలి. 60 ఏళ్లు వరుసగా పాలించిన కాంగ్రెస్ ఏం చేసింది.. ఈ పదేళ్లలో మేమేం చేశామో మీ కళ్లముందే ఉంది. గోల్‌మాల్ కావొద్దు. విజ్ఞత, స్వశక్తితో ఓటేయాలి. అహంకారంతో మాట్లాడేవాళ్లు, గడియారాలు, పైసలు పంచుడు. మందుగుండు సామగ్రి దించుడు ఇదేనా రాజకీయం? నువ్వు ఇచ్చే రూ.60, రూ.70 గడియారం చూసి మా బతుకు అమ్ముకోవాలా.. గడియారంలో బొమ్మ కావాలా.. ఆత్మగౌరవం కావాలా.. కడుపునిండా తిండి కావాలా..? ప్రజలు ఆలోచించాలి.



మధుప్రియ పాడుతుండగా నృత్యం చేస్తున్న మంత్రి పువ్వాడ, ఎమ్మెల్యే వెంకటవీరయ్య

బండికి మాతృభూమిపై ప్రేమ

వేంసూరు లిఫ్టుల దగ్గరకు ఒకప్పుడు నేనొస్తే రైతులు వ్యవసాయానికి నీళ్లు లేక ఏడ్చారు. ఈరోజు బ్రహ్మాండంగా అక్కడ చెరువులన్నీ నింపుకుంటున్నాం. సండ్ర వెంకటవీరయ్య నాతోని పోరాడి కాల్వలు తవ్వించి చెరువులు నింపించాడు. వేంసూరు మండలం పచ్చబడింది. ఈ మండలంలో పుట్టిన పార్థసారథిరెడ్డికి మాతృభూమిపై ప్రేమ ఎక్కువ. మంచి పనులు చేస్తున్నాడు. పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, లైబ్రరీ కట్టించారు. పిల్లలకు ఉద్యోగాలు ఇచ్చారు.

కేసీఆర్ చెబితే శిలాక్షరం

నీళ్లు, కరెంట్, దళితబంధు, రైతుబంధు ఇవన్నీ కావాల్నా.. లేకపోతే కరటక, దమనకులు కావాలా.. సుందోప సుందులు కావాలా? నేను నిన్ను అసెంబ్లీకి పోనివ్వ, పార్లమెంట్‌కు పోనివ్వ అని నాలుగు రూపాయల గర్వంతో జబ్బలు చరుచుకునే నీచులు కావాలా. మంచి పనులు చేసే పార్టీ కావాలా? ఆలోచించాల్సింది ప్రజలే. కేసీఆర్ చెప్పిండంటే జరుగుతది. శిలాక్షరం. సత్తుపల్లిలో దళితబంధు వంద శాతం ఎన్నికల తెల్లారి నుంచే ప్రారంభమవుతది. ఆ టైమ్‌లో సత్తుపల్లి నియోజకవర్గానికి నేను వచ్చి ఒక రోజంతా కూర్చుని ప్రతీ కుటుంబానికి అమలు చేయించే బాధ్యత తీసుకుంటా. చిల్లరగాళ్ల మాటలు పట్టుకోవద్దు. బీఆర్‌ఎస్‌ను అధికారంలో కొనసాగించే ప్రక్రియ మా దళిత జాతి తీసుకోవాలని కోరుతున్నా. కల్లూరు, తల్లాడ, పెనుబల్లి ఫోర్‌లైన్ రోడ్డు కావాలి, సెంట్రల్ లైటింగ్ కావాలని అడుగుతున్నారు. గొర్రెల కాపరులకు రెండో విడత పంపిణీ ప్రారంభమైంది ఇవన్నీ వచ్చేస్తాయి. మిగిలిన పనులన్నీ చేసిపెడతాం.

ఈ సభలో రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, ఎంపీలు నామ నాగేశ్వరరావు, బండి పార్థసారథిరెడ్డి, ఎమ్మెల్సీలు తాతా మధు, మధుసూదనాచారి, ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వరరావు, రాములునాయక్, డీసీసీబీ, డీసీఎంఎస్, గ్రంథాలయ సంస్థ, మున్సిపల్ చైర్మన్లు కూరాకుల నాగభూషణం, రాయల శేషగిరిరావు, ఉమామహేశ్వరరావు, కూసంపూడి మహేష్, నాయకులు గుండాల కృష్ణ, బొంతు రామ్మోహన్, చింతనిప్పు కృష్ణ చైతన్య, డోకుపర్తి సుబ్బారావు, వెంకటేశ్వరరెడ్డి, జీవన్‌కుమార్, లక్కినేని నీరజరఘు, పాలెపు రామారావు, కట్టా అజయ్‌కుమార్, కాటేపల్లి కిరణ్, లక్కినేని అలేఖ్య, దొడ్డా హైమావతి పాల్గొన్నారు.

మంత్రం పెట్టినట్టే మాయం

గతంలో ఎక్కడ చూసినా ఖమ్మం, సత్తుపల్లిలో జనరేటర్లు, ఇన్వర్టర్లు ఉండేవి. ఇప్పుడు మంత్రం పెట్టినట్టే మాయమైపోయినై. మోటారు వైండింగ్ దుకాణాలన్నీ బంద్ అయ్యాయి. గతంలో కరెంట్ ఏ విధంగా ఉండె.. ఇవ్వాళ ఏ విధమైన కరెంట్ వచ్చింది మీరే సాక్షి. దేశంలో ఉచిత కరెంట్ ఇచ్చే ఒకే ఒక్క రాష్ట్రం తెలంగాణ. అది కూడా సీరియస్‌గా ఆలోచించాలి. సాగర్ ఆయకట్టు అని ఫోజులు కొడితే సంవత్సరానికో రెండు సంవత్సరాలకో ఒకసారి పంటకు నీరు వచ్చేది. నీళ్ల కోసం అసెంబ్లీలో మాట్లాడుడు.. పైరవీలు చేయడం జరిగేది. ఈ దుస్థితి ఒక్కొక్కటి పోతోంది.

అభినవ అంబేద్కర్ కేసీఆర్..

– సత్తుపల్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య



సత్తుపల్లి/కల్లూరురూరల్: స్వాతంత్ర్యం వచ్చాక తొలిసారి దళితబంధు తెచ్చి దళితుల జీవితాల్లో వెలుగులు నింపిన అభినవ అంబేద్కర్ ముఖ్యమంత్రి కేసీఆర్ అని సత్తుపల్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కొనియాడారు. ప్రజాఆశీర్వాద సభలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని 30వేల కుటుంబాలకు దళిత బంధు అమలయ్యేలా జీఓ వచ్చినా, ఎన్నికల కోడ్‌తో తాత్కాలికంగా ఆగిందని తెలిపారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో ఆయనకంటే మెరుగైన సంక్షేమ పరిపాలన కేసీఆర్ హయాంలో సాగుతోందని చెప్పారు. సంక్షేమంలో మానవీయ కోణం తప్ప రాజకీయ కోణం చూడని గొప్ప మానవతావాది కేసీఆర్ అని తెలిపారు. పదిహేనేళ్ల సాధారణ కార్యకర్తగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని చెప్పారు. ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు.



సత్తుపల్లి ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన జనం

జంగ్ తెలంగాణ

ఓటు హక్కు వినియోగం అందరి బాధ్యత

అధికారులతో సమీక్షలో కలెక్టర్ గౌతమ్



ఈవీఎంల కమిషనింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

మధిర: ప్రతిఒక్కరు ఓటు హక్కు కలిగి ఉండడమే కాక వినియోగించుకోవడాన్ని బాధ్యతగా భావించాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. మధిర మండలంలో బుధవారం పర్యటించిన ఆయన ఖాజీపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు. ఆతర్వాత ఉద్యోగులకు ఎన్నికల విధులపై టీవీఎం పాఠశాలలో శిక్షణ ఇస్తుండగా పరిశీలించి మాట్లాడారు. ఉద్యోగులు ప్రతీ అంశంపై అవగాహన కలిగి ఉండి పోలింగ్ సజావుగా పూర్తయ్యేలా విధులు నిర్వర్తించాలని సూచించారు. అనంతరం వైఎస్సార్ చౌరస్తా సమీపంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి గోడలపై ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించేలా విద్యార్థులు చిత్రాలు వేస్తుండగా కలెక్టర్ కూడా కుంచె పట్టారు. మున్సిపల్ కమిషనర్ అంబటి రమాదేవి, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎన్నికల శిక్షణ పరిశీలన

వైరా: వైరాలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఓ, ఏపీఓలకు ఇస్తున్న శిక్షణను కలెక్టర్ గౌతమ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవీఎంలు, వీవీ ప్యాట్ల కమిషనింగ్ తదితర అంశాలపై ఆరా తీసి సూచనలు చేశారు. రిటర్నింగ్ అధికారి బి.సత్యప్రసాద్, తహసీల్దార్ కే.వీ.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వీడియో చిత్రీకరణ నడుమ నామినేషన్ల స్వీకరణ

ఖమ్మం సహకారనగర్: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా నామినేషన్ల ప్రక్రియ శుక్రవారం మొదలుకానుండగా, రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వీ.పీ.గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణలో ఆయన మాట్లాడారు. నిర్ణీత తేదీల్లో ఉదయం 11నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరించి, మొత్తం ప్రక్రియను వీడియో చిత్రీకరణ చేయాలని తెలిపారు. అభ్యర్థుల అఫిడవిట్లలో ఎలాంటి ఖాళీలు లేకుండా చూడాలని సూచించారు. అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, రిటర్నింగ్ అధికారులు ఆదర్శ్ సురభి, బి.సత్యప్రసాద్, జి.గణేష్, అశోక్‌చక్రవర్తి, రాజేశ్వరి, అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్ సింగ్, సీపీఓ ఏ.శ్రీనివాస్, డీసీఓ విజయకుమారి, కలెక్టరేట్ ఏఓ అరుణ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టుల కోటలో హస్తం హవా!

- పాలేరులో 11 సార్లు కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు
- ముగ్గురికి మంత్రి పదవులతో అభివృద్ధి పరుగులు
- స్థానికేతరులైనా పలువురిని అక్కున చేర్చుకున్న ఓటర్లు



కత్తుల శాంతయ్య





సంభాని చంద్రశేఖర్



భీమపాక భూపతిరావు



సండ్ర వెంకటవీరయ్య



రాంరెడ్డి వెంకట్‌రెడ్డి



కందాళ ఉపేందర్‌రెడ్డి



తుమ్మల నాగేశ్వరరావు

కూసుమంచి: జిల్లాలో చైతన్యవంతమైన నియోజకవర్గంగా, ఉద్యమ స్ఫూర్తి కలిగిన ప్రాంతంగా పాలేరు నిలుస్తోంది. పాలేరు నియోజకవర్గం అనగానే జిల్లా రైతాంగానికి కల్పతరువైన రిజర్వాయర్.. వేలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దిన జవహర్ నవోదయ విద్యాలయ, రాష్ట్రంలోనే తొలి మత్స్య పరిశోధనా కేంద్రం గుర్తుకొస్తాయి. ఈ నియోజకవర్గ ప్రజలు తెలంగాణ సాయుధ పోరాటంలోనేకాక ప్రజా ఉద్యమాల్లోనూ ముందుండి పోరాడారు. దళిత, గిరిజన, బీసీ కులాలకు చెందిన ప్రజలు ఎక్కువగా ఉండే నియోజకవర్గంలో గెలుపోటముల్లోనూ వారే కీలకమవుతున్నారు. ఇక పోతే ఇక్కడి నుంచి గెలిచిన సంభాని చంద్రశేఖర్, రాంరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు మంత్రులుగా ప్రాతినిధ్యం వహించగా.. ఉప ఎన్నికలు సహా 15 సార్లు జరిగిన ఎన్నికల్లో 11సార్లు కాంగ్రెస్ అభ్యర్థులే విజయం సాధించడం విశేషం.

తొలుత రిజర్వ్‌డ్.. ఆతర్వాత జనరల్

1962కు ముందు పాలేరు నియోజకవర్గం ఖమ్మంలో కలిసి ఉండేది. 1962లో కూసుమంచి, తిరుమలాయపాలెం, నేలకొండపల్లి, ముదిగొండ మండలాలతో నియోజకవర్గం ఏర్పడగా 2004 వరకు ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానంగా కొనసాగింది. 2009 నియోజకవర్గాల పునర్విభజనలో జనరల్‌స్థానంగా మారింది. ఆ సమయాన ముదిగొండ మండలం పక్కనే ఉన్న మధిర నియోజకవర్గంలో కలవగా, ఖమ్మం నియోజ కవర్గం నుంచి ఖమ్మం రూరల్ మండలాన్ని పాలేరులో కలిపారు. ఉమ్మడి జిల్లాలోని మూడు జనరల్ నియోజకవర్గాల్లో ఇదొకటి కావడంతో ఇక్కడ పోటీ చేయడానికి నేతలు పోటీ పడుతుంటారు.

ఓటర్లు

నియోజకవర్గంలో 2,32,606 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో1,12,607 మంది పురుషులు, 1,19,994 మంది మహిళా ఓటర్లు ఉండగా, ఇతరుల కేటగిరీ నుంచి ఐదుగురు ఉన్నారు. కాగా, మొత్తం ఓటర్లలో 56,992 మంది యువత ఉండడం ఈ నియోజకవర్గం మరో ప్రత్యేకత.

కాంగ్రెస్‌కు కంచుకోట

పాలేరు నియోజకవర్గాన్ని ఆది నుంచి కాంగ్రెస్ కంచుకోటగానే భావిస్తారు. ఇక్కడ కమ్యూనిస్టులకు పట్టు ఉన్నప్పటికీ.. ఇప్పటి వరకు జరిగిన 15 ఎన్నికల్లో 11 సార్లు కాంగ్రెస్ అభ్యర్థులే గెలిచారు. కమ్యూనిస్టు ఉద్యమాలకు కేంద్రంగా నిలుస్తున్నా, కాంగ్రెస్‌కు స్థిరమైన ఓటు బ్యాంకు ఉండటంతో ఈ నియోజకవర్గం ఆ పార్టీకి కంచుకోటగా మారింది. కాగా, నియోజకవర్గంలో కమ్యూనిస్టుల ప్రాబల్యం కూడా ఉంది. ఇక్కడి నుంచి గతంలో రెండు సార్లు సీపీఎం, ఓసారి సీపీఐ అభ్యర్థి గెలుపొందారు. కాలక్రమేణా కమ్యూనిస్టుల ప్రాబవం తగ్గి వారు గెలిచే పరిస్థితి లేకున్నా గెలుపోటముల్లో కీలకంగా మారుతున్నారు.

స్థానికేతరులను ఆదరించిన గడ్డ

నియోజకవర్గ ప్రజలు అభివృద్ధి చేసే వారికి, పార్టీలకు ప్రాధాన్యత ఇస్తారే తప్ప వ్యక్తులకు కాదని పలుమార్లు నిరూపితమైంది. అంతేకాక వారి ఆత్మగౌరవాన్ని కాపాడిన వారికే జై కొడతామని చాటారు. స్థానికులు కాకున్నా పలువురిని ఇక్కడ గెలిపించడం ఇందుకు నిదర్శమని చెప్పాలి. ఈ నియోజకవర్గం నుంచి స్థానికేతరులైన భీమపాక భూపతిరావు, సంభాని చంద్రశేఖర్, రాంరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు పోటీకి దిగితే గెలిపించారు.

అనూహ్యంగా తీర్పులు

ఇక్కడి నుంచి గెలిచి మంత్రులుగా బాధ్యతలు నిర్వర్తించిన సంభాని చంద్రశేఖర్, రాంరెడ్డి వెంకటరెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడ్డారు. 2016 ఉప ఎన్నికలో గెలిచిన తుమ్మల నాగేశ్వరరావు సైతం బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో అభివృద్ధి పనులు చేపట్టారు. సాగునీటి ప్రాజెక్టు అయిన భక్త రామదాసు తన గెలుపును సునాయాసం చేస్తుందని ఆయన భావించినా, 2018 ఎన్నికల్లో ప్రజలు నియోజకవర్గ వాసి అయిన కాంగ్రెస్ అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డిని గెలిపించారు. ఈసారి పాలేరు ప్రజలు ఎవరికి పట్టం కడతారో వేచి చూడాల్సిందే.

మంత్రులుగా స్థానం

పాలేరు నియోజకవర్గం నుండి గెలిచిన వారిలో పలువురికి మంత్రివర్గాల్లో స్థానం దక్కింది. ఇక్కడి నుండి గెలిచిన సంభాని చంద్రశేఖర్ 1981, 1989, 2004ల్లో ముఖ్యమంత్రులు మర్రి చెన్నారెడ్డి, నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి, కోట్ల విజయ భాస్కర్ రెడ్డి, వైఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్, దేవాదాయ, సాంఘిక సంక్షేమ శాఖ, విద్యుత్ శాఖ, వైద్య, ఆరోగ్యశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. 2009 లో వైఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలో రాంరెడ్డి వెంకటరెడ్డి సహకార, ఉద్యానవన, బాయిలర్స్ లాంటి కీలక శాఖల మంత్రిగా పనిచేశారు. ఇక 2016 ఉప ఎన్నికలో గెలిచిన తుమ్మల నాగేశ్వరరావుకు కేసీఆర్ మంత్రివర్గంలో ఆర్‌అండ్‌బీ, స్త్రీ, శిశుసంక్షేమ శాఖ మంత్రి పదవులు దక్కాయి.

ఇప్పటి వరకు ఎన్నికైన ఎమ్మెల్యేలు

ఎన్నిక సంవత్సరం	విజేత	పార్టీ
1962	కత్తుల శాంతయ్య	కాంగ్రెస్
1967	కత్తుల శాంతయ్య	కాంగ్రెస్
1972	కత్తుల శాంతయ్య	కాంగ్రెస్
1978	పొట్టపింజర హుస్సేనయ్య	కాంగ్రెస్
1981 (ఉప ఎన్నిక)	సంభాని చంద్రశేఖర్	కాంగ్రెస్
1983	భీమపాక భూపతిరావు	సీపీఐ
1985	బాజీ హన్మంతు	సీపీఎం
1989	సంభాని చంద్రశేఖర్	కాంగ్రెస్
1994	సండ్ర వెంకటవీరయ్య	సీపీఎం
1999	సంభాని చంద్రశేఖర్	కాంగ్రెస్
2004	సంభాని చంద్రశేఖర్	కాంగ్రెస్
2009	రాంరెడ్డి వెంకట్‌రెడ్డి	కాంగ్రెస్
2014	రాంరెడ్డి వెంకట్‌రెడ్డి	కాంగ్రెస్
2016 (ఉప ఎన్నిక)	తుమ్మల నాగేశ్వరరావు	టీఆర్‌ఎస్
2018	కందాళ ఉపేందర్‌రెడ్డి	కాంగ్రెస్

క్లుప్తంగా

రేపు అండర్-14, 17 క్రీడాజట్ల ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్: ఉమ్మడి జిల్లాస్థాయి అండర్-14, 17 బాలబాలికల క్రీడా జట్ల ఎంపికకు ఈనెల 3న పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా పాఠశాలల క్రీడల కార్యదర్శి కె.నర్సింహామూర్తి తెలిపారు. ఈ పోటీలు ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. హ్యాండ్‌బాల్, టేబుల్ టెన్నిస్, వెయిట్ లిఫ్టింగ్ క్రీడాంశాల్లో జరిగే పోటీలకు క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని సూచించారు.

ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న రామకృష్ణ

తిరుమలాయపాలెం: హైదరాబాద్‌లో ఉస్మానియా యూనివర్సిటీ నుంచి తిరుమలాయపాలెం మండలం ఎదుళ్లచెరువు గ్రామానికి చెందిన కాంపాటి రామకృష్ణ డాక్టరేట్ అందుకున్నారు. పొలిటికల్ సైన్స్ విభాగంలో పీహెచ్‌డీ చేసిన ఆయన ఓయూ స్నాతకోత్సవంలో పట్టా స్వీకరించారు. ఈ సందర్భంగా రామకృష్ణను గ్రామస్తులు అభినందించారు.

మద్యం సీసాలు స్వాధీనం

కారేపల్లి: మండలంలోని మాణిక్యారం గ్రామంలో బెల్ట్ పోలీసులు బుధవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా భూక్యా నాగులు బెల్ట్ దుకాణంలో 24 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని ఆయనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పి.రామారావు తెలిపారు.

కామేపల్లిలో...

కామేపల్లి: మండలంలోని ముచ్చర్లలోని షేక్ రఫీయాకు చెందిన బెల్ట్ షాపు నుంచి బుధవారం పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా రూ.5,900 విలువైన 30 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



మద్యం బాటిళ్లు, నిందితులతో ఎక్సైజ్ పోలీసులు

ఖమ్మంక్రైం: కర్ణాటక రాష్ట్రానికి చెందిన మద్యాన్ని ఖమ్మంలో ఎక్సైజ్ పోలీసులు సీజ్ చేశారు. పక్కాగా అందిన సమాచారంతో ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఖమ్మం సారథినగర్‌కు చెందిన సునీల్, రాములుతండాకు చెందిన బానోత్ పవన్, మంగళ్ తండాకు చెందిన సైదులు కర్ణాటక రాష్ట్రానికి చెందిన డిఫెన్స్ మద్యం బాటిళ్లను ద్విచక్రవాహనంపై తీసుకెళ్తూ పట్టుబడ్డారు. ఆ రాష్ట్రంలో తక్కువ ధరకు తీసుకొచ్చి ఇక్కడ ధర పెంచి అమ్ముతున్నట్లు గుర్తించారు. ఈమేరకు రూ.80వేల మద్యాన్ని స్వాధీనం చేసుకోగా, తనిఖీల్లో సీఐలు రాజిరెడ్డి, విజేందర్, ఎస్సైలు అచ్చారావు, సరిత, సిబ్బంది మధు, నాగేశ్వరరావు, వీరభద్రం, సురేందర్ పాల్గొన్నారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

ఎర్రుపాలెం: తొండలగోపవరం-ఎర్రుపాలెం రైల్వేస్టేషన్ల మధ్య ఓ వ్యక్తి బుధవారం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు చేరుకుని మృతుడిని ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా జక్కంపూడి గ్రామ వాసి తేల్లూరు రాజశేఖర్(22)గా గుర్తించారు. వ్యక్తిగత కారణాలతో ఆయన ఆత్మహత్యకు పాల్పడినట్లు భావిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని మధిర ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



రాంబాబు (ఫైల్)

పెనుబల్లి: పొలం పనులకు వెళ్లిన రైతు విద్యుదాఘాతంతో మృతి చెందిన ఘటన మండలంలోని వీఎంబంజర్ సోమ్లానాయక్‌తండాలో బుధవారం చోటు చేసుకుంది. తండాకు చెందిన ఇస్లావత్ రాంబాబు (40) బుధవారం ఉదయం పొలానికి నీళ్లు పెట్టడానికి వెళ్లాడు. అక్కడ విద్యుత్ మోటారు ఆన్ చేసే క్రమాన ప్రమాదవశాత్తు షాక్‌కు గురై కిందపడగా, ఆయనపై తీగలు పడ్డాయి. దీంతో స్థానికులు రాంబాబును పెనుబల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,231

గీత దాటొద్దు.. హద్దు మీరొద్దు

శాసనసభ ఎన్నికలకు సమయం సమీపిస్తోంది. ఇప్పటికే షెడ్యూల్ విడుదల కాగా, శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేసి అదేరోజు నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం పలు మార్గదర్శకాలను విడుదల చేసింది. రాజకీయ పార్టీల నాయకులు, అభ్యర్థులు వీటిని తు.చ తప్పకుండా పాటించాల్సి ఉంటుంది. ఏ మాత్రం ఉల్లంఘించినా ఇబ్బందులు తప్పవనే విషయాన్ని గుర్తించి జాగ్రత్తలు తీసుకోవాలని యంత్రాంగం సూచిస్తోంది.

– ఖమ్మం మయూరిసెంటర్/ఖమ్మం సహకారనగర్

ఎన్నికల వేళ కీలకంగా మార్గదర్శకాలు

- ఎవరైనా పాటించకపోతే ఇక్కట్లే
- అనుక్షణం గమనించే నిఘా కళ్లు
- రేపటి నుంచి మొదలుకానున్న నామినేషన్ల ప్రక్రియ

అనుమతి తప్పనిసరి

సమావేశాలకు ముందుగానే లిఖితపూర్వకంగా పోలీసుల అనుమతి తీసుకోవాలి. నిషేధాజ్ఞలు /ఆంక్షలు ఉన్న ప్రదేశాల్లో సమావేశాలు నిర్వహించద్దు. మీటింగులో వాడే మైక్‌లు, లౌడ్ స్పీకర్లకు సైతం అనుమతి తీసుకోవాలి. సమావేశానికి ఎవరైనా ఆటంకం కలిగిస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలే తప్ప సొంతంగా చర్యలు తీసుకోవద్దు. ఇక ఊరేగింపుల విషయమై కూడా పోలీసులకు ముందుగా తెలియచేయాలి. ఆ మార్గంలో నిషేధాజ్ఞలు ఉన్నాయో తెలుసుకుని ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ముందుకు సాగాలి. ఎవరి దిష్టి బొమ్మలు దహనం చేయొద్దు.



ఖమ్మం ఆర్ఓ(కేఎంసీ) కార్యాలయానికి వంద మీటర్ల దూరంలో గీత

మార్గదర్శకాలివే..

అభ్యర్థి కానీ పార్టీ కానీ కుల, మత, భాషా విద్వేషాలను రెచ్చగొట్టేలా వ్యవహరించడం కానీ ప్రసంగించడం కానీ చేయొద్దు. విధానాలు, కార్యక్రమాలపైనే ప్రసంగాలు, విమర్శలు ఉండాలి. వ్యక్తిగత జీవితంపై విమర్శలు ఉండకూడదు. కుల, మత ప్రాతిపదికపై ఓట్లు అడగకూడదు. ప్రార్థనా ప్రదేశాలను ఎన్నికల ప్రచారం కోసం ఉపయోగించొద్దు. ఓటు కోసం డబ్బులు ఇవ్వడం, బెదిరించడం నిషేధం. యజమానుల లేకుండా వాళ్ల భూమి, బిల్డింగులను ప్రచారానికి ఉపయోగించరాదు. ఇతర పార్టీల ఎన్నికల ప్రచారాన్ని, మీటింగ్‌లకు ఆటంకం కలిగించొద్దు.

మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్

రాజకీయ పార్టీలన్నీ అంగీకరించిన మార్గదర్శక సూత్రాలు, నిబంధనలతో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్(ఎంసీసీ) రూపొందించారు. ఎన్నికలు స్వేచ్ఛగా, పక్షపాతం లేకుండా పారదర్శకంగా పూర్తయ్యేలా ఈ నియమావళి దోహదపడుతుంది. ఇందులో భాగంగా ప్రభుత్వ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేయకూడదు. అధికారిక పర్యటనలను ఎన్నికల పనిలో కలపవద్దు. ప్రభుత్వ వాహనాలు ఉపయోగించకూడదు.

ప్రచారం

విద్యాసంస్థలు, వాటి మైదానాలను ప్రచారానికి వాడకూడదు. ప్రైవేట్ భూములు, భవనాల యజమానుల లిఖితపూర్వక అనుమతి తీసుకుని పత్రాలను రిటర్నింగ్ ఆఫీసర్‌కు ఇచ్చాకే గోడ పోస్టర్లు అంటించాలి. కరపత్రాలు, పోస్టర్లపై ముద్రణాలయాల పేరు, చిరునామా ముద్రించాలి. ప్రచారంలో భాగంగా టోపీలు, కండువాలు ఇవ్వవచ్చు. అయితే, వీటిని ఎన్నికల ఖర్చులో చూపించాలి. ఇక చీరలు, చొక్కాలు ఇవ్వకూడదు. దేవుళ్ల ఫొటోలు, అభ్యర్థి ఫొటోలతో డైరీలు, క్యాలెండర్లు ప్రచురించరాదు. వాహనాల స్టెపినీ కవర్లపై కూడా మత సంబంధిత ఫొటోలు, అభ్యర్థి ఫొటోలు ఉండడానికి వీలు లేదు. ఎన్ని వాహనాలైనా ఎన్నికల ప్రచారానికి ఉపయోగించవచ్చు. అయితే, రిటర్నింగ్ అధికారి నుంచి ముందస్తు అనుమతి తీసుకుని ఒరిజనల్ అనుమతిపత్రాన్ని వాహనానికి అంటించాలి. పర్మిట్ వాహనాన్ని అదే అభ్యర్థి వినియోగించాలి. ఇంకొకరు ఉపయోగిస్తే చర్యలు తీసుకుంటారు.

నామినేషన్ల దాఖలు

రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయం నుంచి వంద మీటర్ల పరిధిలోకి మూడు వాహనాలు మాత్రమే అనుమతిస్తారు. అభ్యర్థితో సహా ఐదుగురు వ్యక్తులకు మాత్రమే కార్యాలయంలోకి అనుమతి ఉంటుంది.

పరిశీలన

అభ్యర్థి, ఎన్నికల ఏజెంట్, ఒక ప్రతిపాదకుడు, మరో వ్యక్తి(న్యాయవాది కావచ్చు) పరిశీలనకు వెళ్లవచ్చు. దీనికి అభ్యర్థి రాతపూర్వకంగా అనుమతి అవసరం ఉంటుంది.

తాత్కాలిక కార్యాలయాలు

ప్రార్థనా స్థలాలు, పాఠశాలలు, పోలింగ్ స్టేషన్లకు 200 మీటర్లలోపు అభ్యర్థుల తాత్కాలిక కార్యాలయాలు ఏర్పాటుచేయొద్దు. కార్యాలయంపై పార్టీ జెండా, బ్యానరు, పార్టీ చిహ్నాన్ని పెట్టుకోవచ్చు. రాత్రి 10 గంటల తర్వాత, ఉదయం 6గంటల లోపు మైకులు, లౌడ్ స్పీకర్లు వాడకూడదు. రాత్రి 10 గంటల తర్వాత పబ్లిక్ మీటింగ్‌లు నిలిపేయాలి. ఎస్ఎంఎస్‌ల ద్వారా అభ్యంతకర వార్తలను ప్రచారం చేయొద్దు.

పది నియోజకవర్గాల్లో యూసీసీఆర్ఐ పోటీ

అభ్యర్థులను ప్రకటించిన పార్టీ



పార్టీ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని పది నియోజకవర్గాల్లో భారత కమ్యూనిస్టు విప్లవకారుల సమైక్యతా కేంద్రం(యూసీసీఆర్ఐ-ఎంఎల్) పార్టీ నుంచి అభ్యర్థులు బరిలో నిలుస్తారని గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పడిగ ఎర్రయ్య, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దండా లింగయ్య వెల్లడించారు. రాష్ట్రమంతా కలిపి నలభై నియోజకవర్గాల్లో పోటీకి సిద్ధమవుతున్నామని తెలిపారు. ఖమ్మంలో బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు పది నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించారు. ఖమ్మం నుంచి బాణాల లక్ష్మణాచారి, పాలేరు నుంచి కొచ్చెర్ల గురవయ్య, మధిర నుంచి జంగం రామచంద్రయ్య, వైరా నుంచి పర్సా రాములు, సత్తుపల్లి నుంచి చిప్పలపల్లి వీరయ్య, కొత్తగూడెం నుంచి కల్తీ లెనిన్, భద్రాచలం నుంచి మర్మం తిరుపతమ్మ, అశ్వారావుపేట నుంచి కుంజ నాగమణి, పినపాక నుంచి వాసం మంగయ్య, ఇల్లెందు నుంచి పోటెబోయిన రవి పోటీ చేస్తారని తెలిపారు. కాగా, కేంద్రంలోని బీజేపీ, తెలంగాణలోని బీఆర్ఎస్ ప్రభుత్వాలు గడిచిన తొమ్మిదేళ్లుగా పెట్టుబడిదారీ శక్తులు, భూస్వాములకే తప్ప పేదలకు మేలు చేయలేదని ఆరోపించారు. బీఆర్ఎస్ సంక్షేమ పథకాలన్నీ కంటితుడుపు చర్యలే తప్ప ప్రజల సమస్యలకు పరిష్కారం చూపడం లేదని తెలిపారు. పాలకుల వైఫల్యాలను వివరిస్తూ తమ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరనున్నట్లు వెల్లడించారు. ఈసమావేశంలో గ్రామీణ పేదల సంఘం ఖమ్మం, భద్రాద్రి జిల్లాల ప్రధాన కార్యదర్శులు కల్తీ రామచంద్రయ్య, షేక్ సోందుమియా, పార్టీ జిల్లా కార్యదర్శి అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

నాడు.. నేడు!

రోజులు మారుతున్న కొద్దీ.. సాంకేతికంగా వస్తున్న మార్పులతో ఓటరు గుర్తింపు కార్డులు నూతనత్వం సంతరించుకుంటున్నాయి. 1986 కంటే ముందు ఓటర్లకు స్లిప్పులు పంపిణీ చేసేవారు. అనంతరం 1986 నుంచి ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీ మొదలైంది. తొలినాళ్లలో ఈ కార్డులు కొంచెం పెద్దగా ఉండేవి. అంతేకాకుండా వివరాలు చేతితో రాసి ఇచ్చేవారు. ఆతర్వాత జేబులో పట్టే కార్డులు ఇవ్వడం మొదలుకాగా, ఫొటోతో సహా ముద్రిస్తుండడంతో ఆకట్టుకునేలా కనిపిస్తున్నాయి.

– ఖమ్మం మయూరిసెంటర్



1986లో చేతితో రాతతో ఇచ్చిన ఓటరు గుర్తింపు కార్డు



ప్రస్తుతం జారీ చేస్తున్న గుర్తింపు కార్డు

ఆరేళ్ల తర్వాత తల్లి చెంతకు..

యూపీలో అప్పగించిన 'అన్నం'



పన్నాలాల్, కుటుంబీకులతో అన్నం శ్రీనివాసరావు

ఖమ్మంఅర్బన్: మతి చెడి, దారి తప్పి ఆరేళ్ల క్రితం ఇంటి నుండి వచ్చిన వ్యక్తిని చేరదీసి ఆరోగ్యం మార్చడంతోపాటు ఇతర రాష్ట్రంలో ఉన్న కుటుంబం చెంతకు చేర్చిన ఖమ్మంలోని అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు అభినందనలు అందుకున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని దేవోరియ జిల్లా జంగిల్ ఇమిలిహ గ్రామానికి చెందిన పన్నాలాల్ యాదవ్‌కు మతిస్థిమితం లేక ఆరేళ్ల క్రితం ఇంటి నుంచి బయటకు వచ్చాడు. అక్కడాఇక్కడా తిరుగుతూ ఖమ్మం చేరుకోగా పోలీసుల సమాచారంతో అన్నం ఫౌండేషన్ ఆశ్రమంలో ఆశ్రయం కల్పించారు. కొన్నాళ్లకు ఆయన ఆరోగ్యం బాగవడంతో ఆరా తీయగా తన కుటుంబీకులు, స్వస్థలం వివరాలు వెల్లడించాడు. దీంతో అక్కడి పోలీసుల సహకారంతో పన్నాలాల్ కుటుంబీకులకు సమాచారం ఇవ్వగా, ఆర్థిక పరిస్థితి కారణంగా ఇక్కడకు రాలేమని అశక్తత వ్యక్తం చేశారు. దీంతో శ్రీనివాసరావు వాహనంలో పన్నాలాల్‌ను తీసుకుని బుధవారం జంగిల్ ఇమిలిహ వెళ్లి పోలీసుల సమక్షాన అప్పగించారు. ఇక తిరిగి రాడనుకున్న కొడుకు క్షేమంగా ఇళ్లు చేరడంతో ఆయన తల్లి జహారిదేవి తదితరులు శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు. ఈ కార్యక్రమంలో అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు, సిబ్బంది వంశీ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపిద్దాం...

టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం



కార్యకర్తలతో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరాం

ఖమ్మం రాపర్తినగర్: వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని తెలంగాణ జనసమితి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఖమ్మంలో బుధవారం ముఖ్య కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడ్డాక కేసీఆర్ ప్రజల ఆకాంక్షలను మరిచిపోయారని విమర్శించారు. ఈమేరకు ఆయనను ఓడించాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తున్న నేపథ్యాన ఆ పార్టీ అభ్యర్థుల విజయానికి కార్యకర్తలు పాటుపడాలని పిలుపునిచ్చారు. టీజేఎస్ జిల్లా కన్వీనర్ వి.బాబుతో పాటు నాయకులు గోపగాని శంకర్రావు, అంబటి శ్రీనివాసరావు, రామనాథం దేవదానం, కరుణాకరరెడ్డి, సర్దార్, జంగిపల్లి రవి, బానోత్ ప్రసాద్, సత్యనారాయణ, ఆంజనేయులు, డేవిడ్, పాపారావు, గణేష్, సాంబయ్య, శ్రీను, రమేష్, తారకరామారావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే ఉద్యమకారులకు మేలు

ఖమ్మం మామిళ్లగూడెం: కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే తెలంగాణ ఉద్యమకారులకు మేలు జరుగుతుందని ప్రొఫెసర్ కోదండరాం, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. తెలంగాణ ఉద్యమకారులు ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కే.వీ.కృష్ణారావు అధ్యక్షతన బుధవారం జరిగిన సమ్మేళనంలో వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల జీవితాలు మెరుగుపడాలన్నా, సమస్యలు పరిష్కారం కావాలన్నా కాంగ్రెస్ అధికారంలోకి రావాల్సిన అవసరముందని చెప్పారు. ఉద్యమకారులకు ఉచిత బస్‌పాస్, 250గజాల స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.10లక్షల నగదు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఎర్నేని రామారావు, గోపగాని శంకర్‌రావు, అర్వపల్లి విద్యాసాగర్, సుధాకర్, గుంతేటి వీరభద్రం, డాక్టర్ ఎంఎఫ్.గోపీనాథ్, పద్మాచారి పాల్గొన్నారు.

జేబీఎస్ మీదుగా బస్సులు

ఖమ్మం మామిళ్లగూడెం: హైదరాబాద్ నుండి ఖమ్మం వైపు కేపీహెచ్‌బీ, జీడీమెట్ల నుంచి నడిపిస్తున్న సూపర్ లగ్జరీ బస్సుల(సర్వీస్ నంబర్లు 8810, 64840, 8895, 8806, 8850)ను గురువారం నుంచి జేబీఎస్ మీదుగా నడిపిస్తామని ఆర్టీసీ ఆర్ఎం సీహెచ్.వెంకన్న తెలిపారు. ఈ బస్సులు జేబీఎస్ మీదుగా కేపీహెచ్‌బీ, బాలానగర్, బోయినపల్లి, సంగీత్, తార్నాక, ఉప్పల్, ఎల్‌బీ.నగర్ పికప్ పాయింట్ల నుంచి వస్తాయని పేర్కొన్నారు.

ప్రచార రథం ఢీకొని ఇద్దరికి గాయాలు



క్షతగాత్రులను పరామర్శిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మధిరరూరల్: సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్కకు సంబంధించిన ఎన్నికల ప్రచార రథం ఢీకొన్న ఘటనలో ఇరువురికి గాయాలయ్యాయి. మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన మందలపు తిరుపతిరావు, బత్తుల వెంకటేశ్వర్లు మోటార్ సైకిల్‌పై చేనుకు వెళ్లి తిరిగి వస్తున్నారు. వీరి వాహనాన్ని బోనకల్ వైపునకు వెళ్తున్న కాంగ్రెస్ అభ్యర్థి భట్టి ఎన్నికల ప్రచార రథం ఢీకొనగా తీవ్రగాయాలు కావడంతో మధిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆతర్వాత ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా కాంగ్రెస్ మధిర మండల అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్, నాయకులు పరామర్శించి అండగా నిలుస్తామని తెలిపారు.

అమెరికాలో శిక్షణకు లాలాపురం ఉపాధ్యాయుడు

దేశం నుంచి ఆరుగురికే దక్కిన అవకాశం



రవికుమార్‌ను అభినందిస్తున్న డీఈఓ సోమశేఖరశర్మ, తదితరులు

కొణిజర్ల: అమెరికాలో నిర్వహించనున్న ఫుల్ బ్రైట్ టీచింగ్ ఎక్స్‌లెన్స్ అండ్ అచీవ్‌మెంట్ శిక్షణకు ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం లాలాపురం గ్రామానికి చెందిన ఆంగ్ల ఉపాధ్యాయుడు సంక్రాంతి రవికుమార్ ఎంపికయ్యారు. ఇంటర్నేషనల్ టీచర్స్ పేరుతో అమెరికాలో 45 రోజుల పాటు సెమినార్లు, వర్క్‌షాప్‌లు నిర్వహిస్తారు. అమెరికా ప్రభుత్వ విద్యాశాఖ ఏటా దాదాపు 70 దేశాల్లో వివిధ సబ్జెక్టుల ఉపాధ్యాయులను ఐరెక్స్ సంస్థ ద్వారా ఎంపిక చేసి ఆయా దేశాల్లో బోధన తీరుపై చర్చించడమే కాక మెరుగైన బోధనకు నిపుణులతో సూచనలు ఇప్పిస్తుంది. ఇందులో భాగంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న రవికుమార్ తొలి 30 మందిలో ఒకరిగా నిలిచి, ఇంటర్వ్యూల ద్వారా ఎంపికైన పది మంది జాబితాలోనూ చోటు దక్కించుకున్నారు. చివరకు భారత్ నుంచి ఆరుగురిని ఎంపిక చేయగా అందులో రవికుమార్ ఉన్నారు. కొణిజర్ల మండలం పల్లిపాడు జెడ్పీహెచ్ఎస్‌లో ఆంగ్ల ఉపాధ్యాయుడైన ఆయన విద్యారంగంలో బాలికల అభివృద్ధికి వివిధ దేశాల్లో తీసుకుంటున్న చర్యలు, బోధనలో శాస్త్ర సాంకేతిక పరికరాల వినియోగంపై అమెరికా వర్క్‌షాప్‌ల్లో చర్చించనున్నారు. ఈ సందర్భంగా ఆయనను జిల్లా విద్యా శాఖాధికారి ఈ.సోమశేఖరశర్మ బుధవారం అభినందించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయుడు రవికుమార్ మాట్లాడుతూ అమెరికా ప్రభుత్వ కార్యక్రమానికి ఎంపిక కావడం ఆనందంగా ఉందని తెలిపారు. బోధనా పద్ధతుల్లో వస్తున్న మార్పులను ఈ పర్యటన ద్వారా తెలుసుకునే అవకాశం ఉందని వెల్లడించారు.

పొలాలే రహదారులై !



సత్తుపల్లి నియోజకవర్గానికి సంబంధించి బీఆర్ఎస్ ఆధ్వర్యాన కల్లూరులోని షుగర్ ఫ్యాక్టరీ రోడ్డులో బుధవారం ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాటుచేశారు. ఈ సభలో ముఖ్యమంత్రి కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రజలు భారీగా హాజరుకాగా... సభా ప్రాంగణానికి ఇలా పొలాల మధ్య నుంచి బారులుదీరి రావడం కనిపించింది.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్

అథ్లెటిక్స్ ఎంపిక పోటీలకు స్పందన



పరుగు పందెం పోటీలో పాల్గొన్న బాలికలు

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా పాఠశాలల క్రీడల సంఘం ఆధ్వర్యాన బుధవారం ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగిన ఉమ్మడి జిల్లాస్థాయి అండర్-17 బాలబాలికల అథ్లెటిక్స్ ఎంపికలకు విశేష స్పందన లభించింది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నుంచి 246 మంది అథ్లెట్లు హాజరయ్యారు. వరంగల్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పాఠశాలల అండర్-17 అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే జట్ల ఎంపికకు ఈ పోటీలు నిర్వహించినట్లు సంఘం కార్యదర్శి కె.నర్సింహామూర్తి తెలిపారు. కాగా, బాలుర జట్టుకు ఆర్.అభినయ్, జె.దీక్షిత్, జి.తేజ్వాల్, ఎం.వెంకటేశ్వర్లు, పి.సాయితేజ, డి.సాయికుమార్, కె.మస్తాన్, సీహెచ్.వినయ్, బి.జస్వంత్, బి.విజయ్‌కుమార్, బి.వినయ్, జి.వెంకటసాయి, బి.వినయ్, ఎం.సంజీవ్, వి.అభిరామ్, ఎం.సాయితేజ, పి.గోపి, సాయికార్తీక్, కె.రాహూల్, బి.చందు, ఎ.వీరేందర్, కె.శ్రావణ్‌కుమార్, కె.రాహుల్, వి.రోహిత్, ఆర్.అభినయ్ నాయక్, ఆర్.ప్రణయ్‌నాయక్, వై.పవన్‌తేజను ఎంపిక చేశారు. అలాగే, బాలికల జట్టుకు ఎ.మనుశ్రీ, డి.బింధు, బి.బింధు, బి.అషా, శ్రీకావ్య, డి.కోమలి, జె.జైష్ణవి, బి.అనూష, కె.సమ్మక్క, కె.భద్రమ్మ, ఎస్.కె.అఫ్రీన్, బి.కృష్ణవేణి, బి.పల్లవి, ఎన్.సరిత, పి.కరుణా, ఎస్.కల్పన, సీహెచ్.దాక్షాయణి ఎంపికైనట్లు వెల్లడించారు. ఈ పోటీలను సీనియర్ అథ్లెటిక్స్ అకాడమీ కోచ్ ఎం.డీ. గౌస్, పీఈటీలు ఎం.డీ.షఫీక్ అహ్మద్, సుధాకర్, రవి, వెంకటేశ్వర్లు, కృష్ణయ్య, ముజాహీద్దీన్, సైదేశ్వర్‌రావు, కృష్ణ, వీరరాఘవయ్య పర్యవేక్షించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Services

■ సూర్యాపేట to ఖమ్మం హైవేకు దగ్గరల్లో నూతనంగా ప్రారంభిస్తున్న మెగా ఫార్మ్ ల్యాండ్ ప్రాజెక్టులో కేవలం రెండు లక్షల 50 వేల రూ॥లతో ప్రాజెక్టు పార్టనర్‌గా చేరి మరెన్నో లాభాలు పొందుతూ ప్రతినెల జరిగే లక్కీ డ్రాలో ఒక ఫ్లాట్ ఉచితంగా పొందండి. వంశీకృష్ణ, డైరెక్టర్ ✆ 94944 99454 [B-4047]

■ ప్రముఖ బ్యాంకు DSAల యందు కాంట్రాక్టు పద్ధతిలో వర్క్ చేయడానికి M/F స్టాఫ్ అ.కా.సు. అ: ఇంటర్, డిగ్రీ జీ: 17K to 35K ఇంట్రెస్ట్ ఉన్న వారు వెంటనే డీటేల్స్ వాట్సాప్ చేయండి. 9885426966 [H-193239]

■ Tanmayee ఓల్డేజ్ హోమ్, YSR సర్కిల్ వద్ద, సైపుల రోడ్డు, విజయవాడ. RMPలు, ఆడ, మగ వర్కర్లు, వంట మనిషి కావలెను. వయస్సు: 20 నుండి 50 సం॥ Ph: 9652423559/7093911010/9573000987 [HA-767]

■ రామకృష్ణ గ్రూప్స్, (TS No.1) VJA, HYD శ్రీమంతులఇళ్ళలో వృద్ధుల సేవకు, వంట/ఇంటిపని, బేబీకేర్ కొరకు వర్కర్స్ కావలెను / 24x7 పంపగలము. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 96038 92233, 62812 08600 [B-1206460]

BUSINESS OFFER

■ ద్వారకా ఎంటర్‌ప్రైజెస్: పేపర్ ప్లేట్స్ & LED మెషిన్స్ పై ప్రతి నెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం, ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం. Ph: 9310515624, 8800496710 [HA-41758]

■ ప్లాస్టిక్ కవర్లకు ప్రత్యామ్నాయం, పర్యావరణానికి అనుకూలం. 100% ఆర్గానిక్ విలువలతో తయారవుతున్న బయోడిగ్రేడబుల్ కవర్లను మార్కెటింగ్ చేయుటకు డిస్ట్రిబ్యూటర్స్ డీలర్లు మరియు మార్కెటింగ్ సిబ్బంది కావలెను. సంప్రదించండి: 9848211153, 9490786468 [H-788343]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

AGRI BUSINESS

■ ''పంట కొనుగోలు ఒప్పందం'' క్రింద వెదురు సాగు చేయదలచిన రైతులు ''ఆరబుల్ ఎర్త్ ప్రైవేట్ లిమిటెడ్ '' , హైదరాబాద్ వారిని సంప్రదించండి. 18008909919 & 9281458305 [H-189441]

CHANGE OF NAME

■ I, Shaikhjilani Shareef (Old Name) S/o. Ramjan Shareef, H.No. 5-7-140/2, Cheruvu Bazar, Khammam Town and District. Telangana State, Hereby Change my name as Shaikjilani Shareef (New Name) for all purpose. [M-1221863]

Wanted

■ మా ఆఫీసు న్యూ బ్రాంచ్ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్‌టైమ్ వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. 9177736926 [G-801029]

ప్రకటన గోరంత! స్పందన కొండంత!!

సాక్షి క్లాసిఫైడ్స్

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి

వివరాలకు :

ఖమ్మం	9010299957
	9705444182
కొత్తగూడెం	9010223783
పాల్వంచ	9705444183
భద్రాచలం	9951602914
మణుగూరు	9705944416
సత్తుపల్లి	9652868642
మధిర	9949927792